# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 05-10-2024 సంపుటి : 06 సంచిక : 10 పేజీలు : 8 వెల : రూ 3-00






## హైకోర్టులో సజ్జలకు ఊరట..

అమరావతి,అక్టోబర్4 : టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మాజీ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి ముందస్తు బెయిల్ పిటీషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ నెల 25వ తేదీ వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఘటన జరిగిన రోజున సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉన్నారని.. ఈ కేసులో నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ఉందని పోలీసుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు.

# ఏపీ మహిళలకు దసరా కానుక




ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణాని ప్రభుత్వం అడుగులు
మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం
ఈ నెల 10న చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం!

అమరావతి,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): టీడీపీ కూటమి ప్రభుత్వం ఏపీ ప్రజలకు దసరా కానుకను ఇస్తుందా అంటే భారీగానే అని ప్రచారం సాగుతోంది. ఈ నెల 10న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు అని అంటున్నారు. అందులో ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో కొన్నింటిని అయినా దసరా నుంచి అమలు చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారు అని అంటున్నారు. మహిళలకు దసరా కానుకగా ఉచితంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వరాన్ని బాబు ఇవ్వబోతున్నారు అని పెద్ద ఎత్తున ప్రచారం అయితే సాగుతోంది. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం విషయం మీద మంత్రి వర్గం సీరియస్ గనే చర్చిస్తుంది అని అంటున్నారు. ఇప్పటికే ఆర్టీసీ అధికారుల బృందం కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలలో పర్యటించి వచ్చి మరీ ఒక నివేదికను ప్రభుత్వానికి అందించారు అని అంటున్నారు. ఆ నివేదిక మీద మంత్రి వర్గం కీలకమైన నిర్ణయం తీసుకుంటుంది అని అంటున్నారు. జిల్లా పరిధిలోనే మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది అని అంటున్నారు. అంటే సొంత జిల్లాలో మహిళలు ఎక్కడ నుంచి ఎక్కడికి అయినా వెళ్లవచ్చు. మరి దీనికి సంబంధించి విధి విధానాలను కూడా ఖరారు చేశారు అని అంటున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి ఈ చాన్స్ అని అంటున్నారు. పేదరికమే కొలమానంగా ఈ ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించాలా లేక అందరికీ అవకాశం ఇవ్వాలా అన్న చర్చ కూడా ఉంది. అదే సమయంలో కొన్ని బస్సులను మాత్రమే ఫ్రీ సర్వీస్ కోసం రిజర్వ్ చేసి పెడితే మిగిలిన బస్సులలో ఆదాయం వస్తుంది అలాగే ప్రయాణీకులు అందరూ వాటిలో ప్రయాణించేందుకు వీలు ఉంటుందని కూడా ఆలోచిస్తున్నారుట. అదే విధంగా ఈ నెలాఖరున వచ్చే దీపావళి నుంచి ఉచితంగా మహిళలకు మూడు వంట గ్యాస్ సిలిండర్లను కూడా ఇచ్చే పథకానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఇక మహిళలు పద్దెనిమిదేళ్ళు నిండితే చాలు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్న దాని మీద కూడా మంత్రి మండలి చర్చిస్తుందని అయితే అది మాత్రం ఇపుడే కాదని విధి విధానాలు పూర్తిగా రూపొందించిన మీదటనే నిర్ణయం తీసుకుంటారు అని అంటున్నారు. అదే విధంగా రైతులకు ఏడాదికి ఇరవై వేల రూపాయలు ఇచ్చే పథకాన్ని కూడా పీఎం కిసాన్ పథకంతో జత చేయడం ద్వారా ఆరు వేల రూపాయల భారాన్ని తగ్గించుకుంటూ మిగిలిన మొత్తానికి విడతల వారీగా అందచేయడానికి చూస్తున్నారని చెబుతున్నారు. ఈ పథకాన్ని సంక్రాంతికి అమలు చేసే విషయం కూడా మంత్రి మండలి సమావేశంలో చర్చిస్తారు అని అంటున్నారు. ఇక తల్లికి వందనం పథకం అయితే వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలని అనుకుంటున్నారు. ఏది ఎమైనా టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యేలోపుగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అన్నీ అమలు చేయాలని పట్టుదలగా ఉన్నారని అంటున్నారు. వైసీపీ నుంచి ఏ ఒక్క విమర్శ రాకుండా ఈ పథకాలను అమలు చేసి తమ సత్తా నిరూపించుకోవాలని టీడీపీ కూటమి చూస్తోంది అని అంటున్నారు. మొత్తానికి ఫ్రీ బస్సు పథకం కనుక దసరాకు అమలు అయితే మహిళలకు పెద్ద బహుమతే బాబు ఇస్తున్నట్లుగా భావించాలి అని అంటున్నారు.


# పార్టీ శ్రేణులతో జగన్మోహన్ రెడ్డి వరుస సమావేశాలు

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చ



అమరావతి,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): వైసీపీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి గత మూడు రోజులుగా పార్టీ శ్రేణులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. తాజాగా పార్టీ సీనియర్ నేతలతో జగన్ తాడేపల్లిలో సమావేశమై రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఏయే జిల్లాల్లో ముఖ్య నాయకులు పార్టీ వీడారు, రానున్న రోజుల్లో పార్టీని వీడనున్న నేతలు ఎవరనే విషయాన్ని జగన్ సీనియర్లను అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. వీలైనంతవరకు పార్టీని వీడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. మరోవైపు పార్టీలో మండలస్థాయి నాయకుల నుంచి జిల్లా స్థాయి నాయకుల వరకు చాలామంది అసంతృప్తితో ఉన్నారనే విషయాన్ని నాయకులు జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. సీనియర్ నేతలు కొందరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని, దీంతో క్షేత్రస్థాయి కేడర్ సైతం ముందుకు రావడం లేదని చెప్పగా.. ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, యాక్టివ్‌గా ఉండే నాయకులకు పార్టీలో పదవులు ఇద్దామని జగన్ చెప్పినట్లు చర్చ జరుగుతోంది. అదే విధంగా పార్టీ అంతర్గత వ్యవహారాలపై సీనియర్ నేతలతో జగన్ చర్చించారట. కూటమి ప్రభుత్వంపై విమర్శల విషయంలో వేగం పెంచాలని జగన్ సీనియర్ నేతలతో చెప్పినట్లు తెలుస్తోంది. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగేలా అవసరమైతే అసత్య ప్రచారానికి వెనుకాడవద్దని దిశానిర్దేశం చేశారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతానికి కూటమి ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగానే ఉన్నట్లు వైసీపీలోనే కొందరు సీనియర్ల చర్చించుకుంటున్న నేపథ్యంలో.. ప్రభుత్వాన్ని టార్గెట్ చేయాలని, ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కాకపోయినా హామీల విషయంలో విఫలమైందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జగన్ చెప్పారట. లడ్డూ వివాదంలో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిన నేపథ్యంలో.. ఈ వివాదంలో కూటమి ప్రభుత్వాన్ని దోషిగా చూపించే ప్రయత్నం చేయాలనే విషయం చర్చించినట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో జగన్ అవలంభించిన విధానాలు, వైఖరి కారణంగానే ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా 11 సీట్లకు పరిమితం చేసినప్పటికీ వైసీపీ అధ్యక్షుడి తీరు మారనట్లు తెలుస్తోంది. వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ఇప్పటికైనా తీరు మార్చుకుని.. విపక్ష పార్టీగా నిర్మాణాత్మక పాత్రను పోషించాల్సి ఉండగా.. ఆ విధమైన ప్రయత్నం చేయడం మానేసి కూటమి ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేయడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# తిరుపతి లడ్డు వివాదంపై సుప్రీం కోర్టు తాజా దర్యాప్తు



న్యూఢిల్లీ: తిరుపతి లడ్డు వివాదంపై తాజా దర్యాప్తుకు సుప్రీంకోర్టు శుక్రవారం ఉత్తర్యవులు జారీ చేసింది. అంతేకాక ఐదుగురు సభ్యులతో కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది. 'సిట్'లో సిబిఐ, ఆంధ్ర పోలీస్, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఈూాంఎ) అధికారులు ఉంటారు. సిట్ విచారణను సిబిఐ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని కూడా సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయస్థానాన్ని "రాజకీయ యుద్ధభూమి"గా ఉపయోగించుకోడానికి అనుమతించబోమని న్యాయమూర్తులు బిఆర్.గవాయ్ , కెవి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ అంశంపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌ల బ్యాచ్‌పై ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రయోగశాల పరీక్ష నివేదిక "అస్సలు స్పష్టంగా లేదు" అని సుప్రీం కోర్టు పేర్కొంది, "తిరస్కరించబడిన నెయ్యి" పరీక్షకు లోబడిందని ప్రాథమికంగా సూచించింది. రాష్ట్రం కథనం ప్రకారం సెప్టెంబర్ 25 న ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది, ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి సెప్టెంబర్ 26న ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయడం జరిగింది.

# పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయి

అధికారం వచ్చిన తర్వాత పవన్ లో మార్పులు
ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల




అమరావతి,అక్టోబర్4: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ణా ఏఐసీసీ అగ్రనేత హుల్ గాంధీపై విమర్శలు చేయడం పెద్ద జోక్ అని విమర్శించారు. అధికారం వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎంగా అన్నివర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇవాళ(శుక్రవారం) షర్మిల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... అన్ని మతాలను పవన్ కళ్యాణ్ సమానంగా చూడాలని కోరారు. ఒక మతానికే ప్రతినిధిగా పవన్ వ్యవహారిస్తున్నారని వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ఆ వేషం వేసుకుని హిందూ మతం గురించి మాట్లాడుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ చర్యల వల్ల ఇతర మతాలను ఆచరించే వారిలో అభద్రతా భావం ఏర్పడదా అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డైరెక్షన్‌లో పవన్ కళ్యాణ్ యాక్ట్ చేస్తున్నారని విమర్శలు చేశారు. ఆర్.యస్.యస్ భావజాలం బీజేపీ పాటిస్తుందని వైఎస్ షర్మిల ఆరోపించారు. జనసేన సెక్యులర్ పార్టీ అనుకున్నామని.. కానీ పవన్ కూడా ఆర్.యస్.యస్ సిద్ధాంతంతో వెళ్తున్నారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై ఊచకోత కోస్తే పవన్ ఎందుకు మాట్లాడరని వైఎస్ షర్మిల అడిగారు. ఇతర మతాల వారు ఓట్లు వేస్తేనే పవన్ గెలిచారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇప్పుడు ఒకే మతం అంటున్న పవన్‌ను ఇతర మతాల వారు ఆదరిస్తారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ యాత్ర చేశారని గుర్తు చేశారు. అటువంటి నేతను... పవన్ కళ్యాణ్ విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాయ నుంచి పవన్ కళ్యాణ్ బయటకురావాలని వైఎస్ షర్మిల హితవు పలికారు.

# జిల్లాలోని పొదుపు లక్ష్మి మహిళలు సీఎం 50 లక్షలు వితరణ

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04-ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా పొదుపు లక్ష్మి మహిళలు ముందుకు వచ్చారని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో స్వర్ణాంధ్రఏ2047 జిల్లా దార్శినిక పత్ర రూపకల్పనలో భాగంగా జిల్లాలోని పొదుపు లక్ష్మి మహిళలు 50 లక్షలు జమ చేసి చేసిన మొత్తంలో మొదటి దఫా 20 లక్షల రూపాయలను శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారన్నారు. జిల్లాలోని అన్ని మండలాలలోని పొదుపు లక్ష్మి మహిళలందరూ తమ వంతు వితరణగా 50 లక్షల రూపాయల మొత్తాన్ని జమ చేశారన్నారు. ఇందులో భాగంగానే మిగిలిన 30 లక్షల రూపాయలను సీఎం సహాయనిధికి అందజేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితులకు జిల్లా తరపున దాతలు ముందుకు వచ్చి ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారని కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు దాతలు విరాళాలు ఇచ్చిన మొత్తాల కంటే పేదలైన పొదుపు లక్ష్మి మహిళలు మానవతా దృక్పథంతో తమ వంతు వితరణను భారీగా సేకరించి జిల్లా తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధికి 50 లక్షల రూపాయలను అందజేయడం హర్షనీయమని కలెక్టర్ తెలిపారు.

# వైసీపీ ప్రభుత్వం కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది

కాకాణి గోవర్ధన్ రెడ్డి కనుసన్నల్లోనే అవినీతి, అక్రమాలు
మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపణ



అమరావతి,అక్టోబర్4 : గత ప్రభుత్వ హయాంలో సర్వేపల్లిలో ఇసుక, గ్రావెల్ అక్రమాలు భారీగా జరిగాయని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. కోట్ల రూపాయల అవినీతికి అప్పటి వైసీపీ ప్రభుత్వం పాల్పడిందని ఆయన మండిపడ్డారు. సూరాయపాలెంలో రూ. 54 కోట్లు, విరువూరులో రూ. 37 కోట్ల రూపాయల మేర పెనాల్టీని గనుల శాఖ విధించిందని, రైతుల పేరుతో అనుమతులు తెచ్చి లక్షల క్యూబెక్ మీటర్ల గ్రావెల్ ను తవ్వేశారన్నారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కనుసన్నల్లోనే అవినీతి, అక్రమాలు జరిగాయని, ప్రధాన దోపిడీదారుడైన కాకాణి గోవర్ధన్ రెడ్డికి మైనింగ్ అధికారులు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ఆయన వ్యాఖ్యానించారు. మైనింగ్ అధికారులు ఎందుకు ఆయనను విచారణ చేయడం లేదని, ఇది మంచి పద్ధతి కాదు.. కరోనా టైంలో హౌస్ లో కూర్చుని సర్వేపల్లిని దోచుకున్న వ్యక్తి కాకాణి గోవర్ధన్ రెడ్డి అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన రూ. 106 కోట్ల అవినీతి 10శాతం మాత్రమే అని, ఇంకా 90 శాతం బయటపడాలని ఆయన అన్నారు. అంతేకాకుండా.. ఐదేళ్ల పాటూ అక్రమంగా ఇసుక, గ్రావెల్, సిలికా, తెల్లరాయి తవ్వకాలు జరిగాయని, ఈ అక్రమాలపై విచారణ చేయాలన్నారు. ఈ భారీ దోపిడీలో జగన్ ప్యాలస్ .. సజ్జలకు వాటాలు పంపారని, అక్రమంగా ప్రజల సొత్తు దోచేసిన కాకాణిని కటకటాల వెనక్కి పంపిస్తామననారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. లడ్డూ వ్యవహారంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, తప్పు చేసిన ఏ ఒక్కరినీ ఆ దేవదేవుడు వదిలిపెట్టడన్నారు.

# సంపాదకీయం

శనివారం 05-10-2024

## ఈషా ఫౌండేషన్ లో ఏం జరుగుతోంది...

తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ లకు వచ్చేయడంతో సంచలనంగా మారింది. ఇటీవల సద్గురు వాసుదేవ్ పై చెన్నై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. '' జగ్గీ వాసుదేవ్ తన కుమార్తెకు వివాహం చేశారు. జీవితంలో బాగా స్థిరపడేలా సంపాదించారు. కానీ ఇతర మహిళల తమ భౌతిక జీవితాన్ని త్యాగం చేయాలని చెబుతున్నారు. ఇలా ఆయన ఎందుకు చేస్తున్నారు" జగ్గీ వాసుదేవ్ ను ఉద్దేశించి తమిళనాడు హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ఇవి. జగ్గీ వాసుదేవ్ మనదేశంలో గాడ్ మ్యాన్ స్టేటస్ అనుభవిస్తున్నాడు. అలాంటి వ్యక్తిపై హైకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఒకరకంగా సంచలనమే అని చెప్పాలి. జగ్గీ వాసుదేవ్ ఇద్దరు మహిళలను నిర్బంధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దానిపై చెన్నై హైకోర్టులో విచారణ జరుగుతుంది. ఈ విచారణ క్రమంలోనే హైకోర్టు వాసుదేవ్ పై సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ సమయంలో పోలీసులు ఈశా ఫౌండేషన్ కార్యాలయంలో తనిఖీలు మొదలుపెట్టారు.. వాస్తవానికి వాసుదేవ్ వివాదాలు ఎదుర్కోవడం కొత్త కాదు. ఆయన భార్య మరణించిన తీరు ఇప్పటికీ ఒక వివాదంగానే ఉంది. పర్యావరణం గురించి పదే పదే చెప్పే జగ్గీ వాసుదేవ్.. పర్యావరణ నిబంధనలు పట్టించుకోకుండానే ఈషా ఫౌండేషన్ భవనాలను నిర్మించాడనే విమర్శలు ఉన్నాయి. ఇక ఈషా ఫౌండేషన్ కార్యాలయంలో కొంతమంది మహిళలు అపహరణకు గురయ్యారని స్వయంగా తమిళనాడు పోలీసులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లిన సంఘటనలో చాలా ఉన్నాయి. 2022లో జగ్గీ వాసుదేవ్ సేవ్ సాయిల్ అనే నినాదంతో 27 దేశాల్లో 30 వేల కిలోమీటర్ల యాత్ర చేశారు. భారతదేశానికి తిరిగివచ్చారు. ఓ ప్రైవేట్ ఛానల్ ఆయనను ఇంటర్వ్యూ చేసింది. సేవ్ సాయిల్ పేరుతో మీరు చేస్తున్న యాత్ర బాగుందని చెప్పిన ఆ టీవీ ఛానల్.. ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండానే మీరు ఈషా ఫౌండేషన్ భవనాలు ఎందుకు నిర్మించాలని ప్రశ్నించింది. ఆ ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పకపోగా.. దేశంలో చట్టాలు లేవా అంటూ వ్యాఖ్యానించారు. అనంతరం ఆ టీవీ ఛానల్ విలేఖరి మరో ప్రశ్న వేయగా.. ష్ అంటూ సద్గురు చిరాకును వ్యక్తం చేశారు. ఈషా ఫౌండేషన్ కార్యాలయంలో ఆరుగురు మహిళలు అదృశ్యం అయ్యారట. 2016 తర్వాత ఆ మహిళను కనిపించడం లేదని తమిళనాడు పోలీసులు హైకోర్టుకు విన్నవించారు. గత ఏడాది మార్చిలో తన సోదరుడు 46 సంవత్సరాల గణేషన్ ఈషా ఫౌండేషన్ కార్యాలయం నుంచి కనిపించకుండా వెళ్లాడని తిరుమలై అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు ఆదేశాలతో పోలీసులు విచారణ నిర్వహించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జగ్గీ వాసుదేవ్ తన యూట్యూబ్ వీడియోల ద్వారా రకరకాల విషయాలను చెబుతుంటారు. ఇటీవల గ్రహణానికి సంబంధించి ఒక విషయాన్ని వెల్లడించారు. చంద్రగ్రహణం సమయంలో ఆహారం కలుషితమవుతుందని ఆయన చెప్పడం సంచలనంగా మారింది. జగ్గీ వాసుదేవ్ భార్యా మరణం విషయంలోనూ అనేక సందేహాలు ఉన్నాయి. వాసుదేవ్ భార్య 997 జనవరి 23న చనిపోయారు. అయితే ఆయన తన భార్య మరణాన్ని మహా సమాధిగా పేర్కొన్నారు. మహా సమాధి అంటే ఒక వ్యక్తి తనకు తానుగా శరీరాన్ని విడిచిపెట్టే విధానం. అయితే మన దేశంలో మహా సమాధి పొందిన వ్యక్తిని ఎవరూ దానం చేయలేదు. ఒకవేళ మహా సమాధి ఒక వ్యక్తి పొందితే.. ఆ వ్యక్తిని సమాధి మాత్రమే చేస్తారు.. గతంలో కల్కి భగవాన్ ఆశ్రమంలోనూ ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి. అప్పట్లో ఆశ్రమంలో ఉన్నవారు పోలీసులు తనిఖీలు చేసినప్పుడు ఇలాంటి సమాధానాలు చెప్పారు. చూడబోతే ఈషా ఫౌండేషన్ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలు సంచలనంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఫౌండేషన్ కార్యాలయంలో రకరకాల యోగాలు, ఇతర అభ్యసన ప్రక్రియల గురించి మాత్రమే చెబుతున్నారని అక్కడ ఉండే వారు అంటున్నారు. అయితే అక్కడ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయని కొంతమంది ఆరోపిస్తున్నారు. హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో తమిళనాడు పోలీసులు అక్కడ సోదాలు చేస్తున్నారు. ఒకవేళ పోలీసులు అనుకున్నట్టుగా అక్కడ ఏదైనా దొరికితే.. జగ్గీ వాసుదేవ్ పై కచ్చితంగా చర్యలు ఉంటా యని ప్రచారం జరుగుతున్నది. అయితే సద్గురు తన భార్య కంటే భారతీ అనే మహిళతోనే ఎక్కువసేపు ఉండేవారట. ఈ విషయాన్ని అరుంధతి సుబ్రహ్మణ్యం అనే మహిళ సద్గురు మోర్ దెన్ లైఫ్ అనే పుస్తకంలో రాశారు. ఇక ఈషా ఫౌండేషన్ వెబ్ సైట్ లో అనేక వస్తువులను విక్రయిస్తుంటారు. అయితే అవి అత్యంత ఖరీదుగా ఉంటాయి. జగ్గీ వాసుదేవ్ పాదాల ఫోటో ఫ్రేమ్ 3200 అంటే.. ఆ వెబ్సైట్ ఆధారంగా ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అక్కడ ఒక రుద్రాక్ష ఖరీదు 10,000 దాకా ఉంటుంది. జగ్గీ వాసుదేవ్ తన కుమార్తెకు వివాహం చేశారు. కానీ చాలామంది యువతలను సన్యాసం తీసుకోవాలని ప్రోత్సహించారు..

## సమ సమాజ నిర్మాణమే సమరత ధ్యేయం

### కే శ్యాం ప్రసాద్ సామాజిక సమరత వేదిక




తిరుపతి : శుక్రవారం శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ లోని ఆర్ట్స్ బ్లాక్ ఆర్డర్ నందు ఆంధ్రప్రదేశ్ సామాజిక సమరత వేదిక ఆధ్వర్యంలో " భూమిలేని వ్యవసాయ కూలీల ఆర్థిక సామాజిక పెంపుదల" అనే అంశం పైన అవగాహన సమావేశం మరియు పుస్తకావిష్కరణ జరిగిందని ఆంధ్రప్రదేశ్ సామాజిక సమరత వేదిక కన్వీనర్ డాక్టర్ డి సుబ్రమణ్యం తెలిపారు. ఈ సమావేశాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ చీఫ్ గెస్ట్ డాక్టర్ పరుశురామయ్య రిటైర్డ్ ఐఏఎస్ మాట్లాడుతూ సామాజిక సమరత వేదిక దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాలలోని భూమి లేని వ్యవసాయ కూలీల సమస్యలు, వారు ఎదుర్కొంటున్న ఆర్థిక సామాజిక అంశాలపై కులంకుశంగా వివరించడం జరిగింది. అలాగే దేశవ్యాప్తంగా సర్వే చేసే సమయంలో భూమిలేని వ్యవసాయ కూలీలు పని భారం అధికంగా ఉండటం వల్ల, భూమి అందుబాటు లేకపోవడం వలన, రైతుల నుండి సానుకూల దృక్పథం లేకపోవడం వలన గ్రామాల్లో మరియు పల్లెల్లో రోజువారి కూలీ దొరికే పరిస్థితి లేదని గ్రహించాము. ఇలాంటి వారి అభివృద్ధి కోసం గ్రామాల్లో నుంచి సమావేశానికి వచ్చిన భూమిలేని వ్యవసాయ కూలీల అభిప్రాయాలు తెలుసుకొని వారి అభిప్రాయాలు మేరకే ప్రణాళిక చేసుకొని భవిష్యత్తులో జిల్లా రాష్ట్ర దేశ స్థాయిలో సంకటితముగా ప్రభుత్వ సమన్వయం చేసుకొని సమస్యలు పరిష్కారాలకు కృషి చేస్తామని ఆయన సూచనలు చేశారు. మరో అతిధి కే శ్యాం ప్రసాద్ జాతీయ కన్వీనర్ సామాజిక సమరత వేదిక మాట్లాడుతూ సామాజిక సమరత వేదిక భూమిలేని వ్యవసాయ కూలీల అభిప్రాయ సేకరణ అనుగుణంగానే నిరంతరం పనిచేస్తూ సమస్యలు పరిష్కార దిశగా మరియు గిరిజనులైన భూమిలేని వ్యవసాయ కూలీలు అటవీ ఉత్పత్తుల సేకరించినట్టు అయితే శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ మెడికల్ కళాశాల ద్వారా టీటీడీ వారి అనుమతి తీసుకొని కొనుగోలు చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు డాక్టర్ దగ్గుమిట్ట శ్రీహరి రావు, డాక్టర్ శ్యాం ప్రసాద్ జి నేషనల్ కన్వీనర్, శ్రీ ఏం లీలా కృష్ణ అడ్వకేట్, ఎస్ ఆర్ కే ఎడ్యుకేషన్ సొసైటీ డి సుబ్రహ్మణ్యం, పరివర్తన సర్వే సొసైటీ పి అమర్నాథ్, గ్రేట్ విజన్ సొసైటీ డాక్టర్ జివిఎస్ బాబు, సెంటరు ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ సొసైటీ ఆర్ఎస్ చంద్రశేఖర్, హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ఎన్ దొరస్వామి, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ శ్రీమతి గిరిజ, మన సంస్కృతి కళా సంస్థ కే రెడ్డప్ప, ఏపీ యానాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు చందమామల కోటయ్య, శ్రీనిధి సొసైటీ మరియు ఎస్వీ యూనివర్సిటీ స్కాలర్ శ్రీ ఓ. రాజశేఖర్, తిరుపతి చంద్రగిరి శ్రీకాళహస్తి, పీలేరు రామచంద్రపురం ఏర్పేడు వెదురుకుప్పం ప్రాంతాల నుండి భూమి లేని వ్యవసాయ కూలీలు సిద్ధమ్మ, మమత, సుబ్బమ్మ వెంకటమ్మ, రజితతదితరులు హాజరైనారు.

## భారీ మోసాన్ని విఫలం చేసిన కెనరా బ్యాంకు

ఖమ్మం:అక్టోబరు 4, (న్యూస్ పల్స్) ఖమ్మం నగంలోని జుబిలిపుర కెనరా బ్యాంక్ శాఖలో ఒక సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ గ్రూపులకి సంబంధిం చిన మెప్మ ఆర్పీ చేసిన విఫలయత్నం నివ్వెరపరిచింది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం నగరంలోని కెనరా బ్యాంక్ కి గత కొన్ని రోజులక్రితం వేరే బ్యాంక్ లోని హెల్ప్ గ్రూప్ లోన్ లని టేకోవర్ చేసికొని లోన్ సౌకర్యం కల్పించాలని విన్నపాలు వచ్చాయి. బ్యాంక్ వారు నియమాలనుగుణంగా కావల్సిన పత్రాలని సమర్పించాలని సూచించారు. తదుపరి అవసరమైన పరిశీలన చేసి బ్యాంక్ లోన్ మంజూరు చేసారు. ఈ ప్రక్రియలో భాగంగా గ్రూప్ సభ్యుల ఖాతాలోకి జమ చేయవలసిన సమయంలో కెనరా బ్యాంక్ సిబ్బంది గ్రూప్ సభ్యులను విచారిస్తుండగా, గ్రూప్ లీడర్లు తమకు 20 లక్షల రుణం మంజూరు అయినట్టు మెసేజ్ వచ్చినదని కానీ వారికి 10 వేలు రూపాయలు సబ్సిడీ వచ్చింది, తిరిగి వాటిని చెల్లించవలసిన అవసరం లేదు అని మెప్మా రిసోర్స్ పర్సన్ చెప్పినట్లుగా తెలిపినట్లు గురు సభ్యులు బ్యాంక్ సిబ్బందికి తెలిపారు. తమకు ఈ లోన్ తో ఎటువంటి సంబంధం లేదని 20 లక్షల రుణం గురించి తమకు చెప్పకుండా 10000 సబ్సిడీ వస్తుందంటే మాత్రమే తాము అప్లికేషన్పై సంతకాలు పెట్టామని వారు వివరించారు. సభ్యుల సమాచారం మేరకు జరిగిన మోసపూరిత చర్యని బ్యాంక్ వారు గుర్తించి సంబంధిత మెప్మా ఖమ్మం విభాగం వారి దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకునేల భరోసా పొందారు. అటుపిమ్మట బ్యాంక్ సిబ్బంది అన్నీ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లని ఉద్దేశిస్తూ, ఏ ఊరి నుండి అయిన సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లు ఋణాలు అవసరం ఉన్నట్లయితే బ్యాంక్ వారిని నేరుగా సంప్రదించి లబ్ధి పొందగలరని సూచించారు. ఇట్టి మోసపూరిత చర్యని సకాలంలో గుర్తించి పెద్ద మోసాన్ని కెనరా బ్యాంకు చాకచక్యంగా స్పందించి నివారించగలిగారు. సకాలంలో కెనరా బ్యాంకు స్పందించిన తీరు అద్భుతం అని చెప్పవచ్చు. బ్యాంకు ఎంత జాగ్రత్త గా కస్టమర్ సేవలు అందిస్తున్నాయి అనే విషయాన్ని మరోసారి రుజువు చేశారు. మోసానికి పాల్పడ్డ మెప్మా రిసోర్స్ పర్సన్ పై కెనరా బ్యాంక్ చట్టపరమైన చర్యల్ని తీసుకుంటామని తెలియజేసినది.




## దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ. 21 వేల కోట్లతో అభివృద్ధి పనులు : జీఎం





అమరావతి : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సుమారు రూ.21 వేల కోట్లతో వివిధ రైల్వే ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని ఎస్సీఆర్ జనరల్ మేనేజర్ అరుణ్కుమార్ జైన్ వెల్లడించారు. శుక్రవారం విజయవాడలోని రైల్వే ఈటీటీసీ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్లో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై సమావేశాన్ని నిర్వహించారు. రాజధాని అమరావతి కోసం కొత్తగా రైల్వేలైను సర్వే పూర్తయ్యిందని వెల్లడించారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు మీదుగా కొత్త రైల్వేలైనుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపి, నిధులు కేటాయించగానే కొత్త రైల్వే లైను పనులు ప్రారంభిస్తామని వివరించారు. ఏపీలో 73 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. 2024-25 రైల్వేబడ్జెట్లో ఏపీకి రూ. 9,154 కోట్లు మంజూరయ్యాయని జీఎం ప్రకటించారు. మచిలీపట్నం-బాపట్ల- రేపల్లె రైల్వే లైన్ కోసం ఎంపీలు ప్రతిపాదనలు ఇచ్చారని ఆయన తెలిపారు.

## గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత..



విభారె న్యూస్ అక్టోబర్ 04 ఎమ్మిగనూరు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో దేవి శరన్నవరాత్రి ఉత్సవములు లో భాగంగా శుక్రవారం శుద్ధ విదియ శ్రీ వాసవి మాతకు గాయత్రి దేవి అమ్మవారి అలంకారం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పట్టణ ప్రజలు విరివిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులైనారు. గర్భగుడిలోని వాసవి మాతకు రాతన గురు ప్రసాద్ వారిచే గాయత్రి దేవి అలంకారం నిర్వహించారు


## ధనలక్ష్మి అలంకరణ లో భక్తులకు దర్శనమిచ్చిన జమ్ములమ్మ దేవి

### 11.50 లక్షలు రూపాయిలు నోట్లు తో అలంకరణ... శ్రీ జమ్ములమ్మ దేవి ఆలయ కమిటీ ధర్మకర్త తట్టే బుడ్డప్ప...



విభారె న్యూస్ ఎమ్మిగనూరు,అక్టోబర్ 4...దసరా నవరాత్రులు లో భాగంగా 2 రోజు శ్రీ జమ్ములమ్మ దేవి ను ధనలక్ష్మిరూపంలోఅలంకరణ చేశారు. శుక్రవారం పట్టణం లోని సోగనూరు రోడ్డు లో వెలసిన శ్రీ జమ్మలమ్మ అమ్మ వారికి దాదాపు 11.50 లక్షలు రూపాయిలు నోట్లు తో అలంకరణ చేశారు. ఆలయ కమిటీ ధర్మకర్త తట్టే బుడ్డప్ప అధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తట్టే పార్వతమ్మ,తట్టే శ్రీవిద్య, కేంచుగుండు జానకి,బుట్టా ప్రియా,సాహితీ పాల్గొన్నారు.

## మహారాష్ట్ర బీజేపీకి షాక్.. శరద్ పవార్ ఎన్సీపీలో చేరనున్న మాజీ మంత్రి



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని బీజేపీకి ఆ పార్టీ నేత షాక్ ఇచ్చారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో తాను చేరుతున్నట్లు ప్రకటించారు. ఆయన కుమార్తె కూడా ఇదే సంకేతం ఇచ్చారు. బీజేపీ నేత, మాజీ మంత్రి హర్షవర్ధన్ పాటిల్ శుక్రవారం కీలక ప్రకటన చేశారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరుతానని తెలిపారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన మద్దతుదారులతో సమావేశమైన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం హర్షవర్ధన్ పాటిల్ మీడియాతో మాట్లాడారు. 'నేను గత రెండు నెలలుగా ఇందాపూర్ నియోజకవర్గం అంతటా పర్యటిస్తూ వివిధ వర్గాల ప్రజలను కలుస్తున్నా. ఒక విషయం స్పష్టంగా ఉంది. నేను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రజలు పట్టుబడుతున్నారు' అని అన్నారు. కాగా, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్తో తాను సమావేశమైనట్లు హర్షవర్ధన్ పాటిల్ తెలిపారు. తన మద్దతుదారులతో మాట్లాడిన తర్వాత శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్సీపీ ఎమ్మెల్యే దత్తమామ భర్నేపై పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబరు 7న పూణె జిల్లాలోని ఇందాపూర్లో జరిగే భారీ ర్యాలీలో ఎన్సీపీ (ఎస్పీ)లో ఆయన చేరుతారని మద్దతుదారులు తెలిపారు. మరోవైపు ఇందాపూర్ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన హర్షవర్ధన్ పాటిల్, ప్రస్తుతం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ ఛైర్మన్, కోఆపరేటివ్ బ్యారన్గా ఉన్నారు. 2019 సెప్టెంబరులో కాంగ్రెస్ పార్టీని వీడిన ఆయన బీజేపీలో చేరారు. ఇందాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని భావించారు.

# లాయర్ ఖర్చు..ఎవరిది...

తిరుమల, అక్టోబరు 4, తిరుమల లడ్డు వ్యవహారం యూటర్న్ తీసుకుంది. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇవ్వడం హాట్ టాపిక్ గా మారింది. కోట్లాదిమంది భక్తుల మనోభావాల విషయంలో.. రాష్ట్ర సీఎం గా ఉన్న చంద్రబాబు బాధ్యత రాహిత్యంగా ప్రకటనలు చేస్తే ఎలా అని అర్ధం వచ్చేలా తప్పు పట్టింది.ఆధారాలు లేకుండా,సెకండ్ ఒపీనియన్ తీసుకోకుండా ఎలా బయటకు వెల్లడిస్తారని ప్రశ్నించింది. టీటీడీ లడ్డు తయారీకి సంబంధించి..నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందని చంద్రబాబు ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశంలో ప్రస్తావించారు. అక్కడి నుంచి రచ్చ ప్రారంభమైంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అయితే సిట్ విచారణ నిలిపివేయాలని, సీబీఐ దర్యాప్తు ఏర్పాటు చేయాలని వైసీపీ నేత వైవి సుబ్బారెడ్డి, బిజెపి మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం అయింది. అయితే టీటీడీ తరుపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్ర వాదించారు.బలమైన వాదనలు వినిపించారు. ఇఅయితే ఈ కేసులో సిద్ధార్థ లూథ్ర ఎంటర్ కావడం చర్చకు దారితీస్తోంది. గతంలో చంద్రబాబుపై అక్రమ కేసుల్లో వాదనలు వినిపించారు ఆయన.చంద్రబాబుపై అవినీతి కేసులు నమోదైన సంగతి తెలిసిందే. దాదాపు 52 రోజులు పాటు ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.ఆ సమయంలో ఆయన ఏసీబీ కోర్టు నుంచి మళ్లీ సుప్రీంకోర్టు వరకు చంద్రబాబు తరఫున వాదనలు వినిపించారు. చివరకు చంద్రబాబుకు బెయిల్ వచ్చేలా చేశారు. అయితే అప్పట్లో సిద్ధార్థ లూథ్ర పెద్ద చర్చకు దారి తీశారు.లూథ్ర సుప్రీంకోర్టులో సీనియర్ మోస్ట్ లాయర్. ఎన్నో కేసుల్లో విజయం సాధించారు. సక్సెస్ ఫుల్ లాయర్ కావడంతో నిత్యం బిజీగా ఉంటారు. ఒక్కో కేసు విచారణకు లక్షల్లో తీసుకుంటారని ప్రచారం ఉంది. గంటలకు లక్షలు తీసుకుంటారని కూడా టాక్ నడిచింది. దేశంలో ఏ కోర్టులనైనా వాదించేందుకు సిద్ధమని..ప్రత్యేక విమానాల్లో వచ్చి వాదించిన సందర్భాలు కూడా ఉన్నాయని ఎన్నో రకాల విశ్లేషణలు ఉన్నాయి. అటువంటి సిద్ధార్థ లూథ్ర ఇప్పుడు టిటిడి లడ్డు కేసులో వాదనలు వినిపించడం విశేషం.అప్పట్లో చంద్రబాబు టిడిపి అధినేత. ఓ రాజకీయ పార్టీ నాయకుడు. కచ్చితంగా టిడిపి లాయర్ ఖర్చులు అప్పట్లో భరించి ఉంటుంది. కానీ ఇప్పుడు టీటీడీ లడ్డు వివాదం కేసులో లూథ్ర వాదనలు వినిపిస్తున్నారు. అయితే ఆయనకు ఫీజు టీటీడీ చెల్లిస్తుందా?లేకుంటే ప్రభుత్వం చెల్లిస్తుందా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. లక్షలాది రూపాయలు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అందుకే ఎవరు చెల్లిస్తారో?అన్నది మాత్రం బయటకు తెలియడం లేదు. టీటీడీ చెల్లిస్తే మాత్రం ప్రత్యర్థులకు ప్రచారాస్త్రంగా మారే అవకాశం ఉంది.

# తమ్మినేని దారెటు...



శ్రీకాకుళం, అక్టోబరు 4, పాలిటిక్స్ ఈజ్ ఆల్వేస్ ఇంట్రెస్టింగ్. పైగా పేరున్న నేత పదవిలో ఉన్నా లేకపోయినా హాట్ టాపికే. ఏపీలో అలాంటి కటౌటే తమ్మినేని సీతారాం. ఫైర్ బ్రాండ్‌గా..పదవి ఉన్నా.. లేకపోయినా..తనకంటూ ఓ సెపరేట్ స్టైల్ ఉంటుంది. ప్రత్యర్థులపై మాటల తూటాలతో విరుచుకుపడుతుంటారు. అలాంటి సీనియర్ నేతకు ఇప్పుడు కొత్త కష్టం వచ్చి పడిందట. దశాబ్దాలుగా తను కంచుకోటగా తయారు చేసుకున్న నియోజకవర్గం చేజారిపోతుందన్న భయం వెంటాడుతోందట.ఐదుసార్లు ఎమ్మెల్యేగా..మంత్రిగా, ఏపీ శాసనసభాపతిగా..పనిచేశారు తమ్మినేని సీతారాం. మూడు దశాబ్దాలుగా ఆమదాలవలస నియోజకవర్గాన్ని తన అడ్డాగా మార్చుకున్నారు. అయితే ఆయన 2019లో ఎమ్మెల్యేగా గెలిచి స్పీకర్ అయిన తర్వాత ఆమదాలవలస నియోజకవర్గంలో పరిస్థితులు మారుతూ వచ్చాయి. స్వపక్షంలోనే విపక్షం తయారైంది. సీతారాం గెలుపు కోసం కష్టపడ్డ నేతలే ఆయనపై తిరుగుబాటు చేశారు. సువ్వారిగాంధీ లాంటి సీనియర్ నేత.. ఏకంగా తమ్మినేని సీతారాంపై రెబల్‌గా పోటీ చేశారు. నియోజకవర్గంలో సొంత పార్టీలో వ్యతిరేకతకు తమ్మినేని కుటుంబ సభ్యులే కారణమన్న టాక్ జిల్లాలో గట్టిగా వినిస్తోంది.ఇటీవల శ్రీకాకుళం జిల్లా ముఖ్యనేతలతో వైసీపీ అధినేత జగన్ సమావేశం అయ్యారు. ఆ మీటింగ్ తర్వాత తమ్మినేని సీతారాంకు శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ ఇంచార్జ్‌గా బాధ్యతలు అప్పగించడం ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. తమ్మినేనిని వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ బరిలో దించుతారని.. ఆమదాలవలస నియోజకవర్గ బాధ్యతలు కొత్త నాయకుడికి అప్పగించేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోందంటూ వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తమ్మినేని సీతారాం కొడుకు చిరంజీవి నాగ్ ఆమదాలవలస రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నారు. అయితే అనేక మంది వైసీపీ ద్వితీయస్థాయి నేతలు చిరంజీవి నాగ్ నాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఆమదాలవలసకు కొత్త నాయకుడు కావాలన్న చర్చ క్యాడర్‌లో గట్టిగానే నడుస్తోంది.వయస్సు రిత్యా తమ్మినేని వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అన్నది కూడా డౌట్. దీంతో తన కుమారుడ్ని ఎలాగైనా ఆమదాలవలస నుంచి బరిలో దించాలన్న ప్లాన్ చేస్తున్నారట. స్థానిక నాయకుల నుంచి మాత్రం వ్యతిరేకత వ్యక్తం అవుతుండటంతో..తన వారసుడి రాజకీయ భవితవ్యంపై తెగ బెంగ పెట్టుకున్నారట. తాను నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉంటేనైనా కొడుకుకు టికెట్ కోసం ఫైట్ చేసే వాడినని.. తనను పార్లమెంట్ ఇంచార్జ్‌గా వేశారని బాధ పడుతున్నారట. మరి నియోజకవర్గంపై ఉన్న పట్టుతో కొడుకుకే ఇంచార్జ్ బాధ్యతలు వచ్చేలా లాబీయింగ్ చేస్తారా లేక..ఆమదాలవలస నియోజకవర్గానికి తమ్మినేని సీతారం గుడ్ బై చెబుతారో వెయిట్ చేయాల్సిందే

## అర్ధరాత్రి రెండు గంటల వరకు పూజలు

కాకినాడ,కాకినాడ జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. మొదటి రోజు అర్ధరాత్రి రెండు గంటల వరకు పూజలు జరిగాయి .రెండో రోజు శుక్రవారం తెల్లవారుజాము నుంచి తిరిగి భక్తులు ఆలయాలకు చేరుకుంటున్నారు.నవరాత్రులలో అమ్మవారికి ప్రీతికరమైనది శుక్రవారం, మూలా నక్షత్రం. రెండో రోజే శుక్రవారం రావడంతో ఆలయాలకు వస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతోంది.

# షర్మిల సొంత అజెండా పై నేతల గుర్రు..

విజయవాడ, అక్టోబరు 4, వైఎస్ షర్మిలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆగ్రహంతో ఉన్నాయా? ఉన్న కొద్దిపాటి మంది సీనియర్లు ఆమెను వ్యతిరేకిస్తున్నారా? ఆమెపై హై కమాండ్ కు ఫిర్యాదులు వెళుతున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. తెలంగాణలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరిట రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించారు షర్మిల. సుదీర్ఘకాలం తెలంగాణలో కూడా పాదయాత్ర చేశారు. కానీ అనుకున్న స్థాయిలో తెలంగాణ ప్రజల నుంచి స్పందన రాలేదు. దీంతో గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు షర్మిల. అటు తరువాత కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ సమక్షంలో పార్టీలో చేరారు. గతంలో తన సోదరుడు జగన్ కాంగ్రెస్ పార్టీని విభేదించి బయటకు వచ్చినప్పుడు ఆయనకు బాహాటంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంలో కాంగ్రెస్ పై విపరీతమైన వ్యాఖ్యలు చేశారు. కానీ అదే కాంగ్రెస్ పార్టీలో చేరి అందరి దృష్టిని ఆకర్షించారు. జగన్ దూకుడుకు కళ్లెం వేయాలని భావించిన కాంగ్రెస్ పార్టీ.. షర్మిలను ప్రయోగించింది. ఏపీ కాంగ్రెస్ పగ్గాలు అప్పగించింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న పరిమితమైన సీనియర్ నాయకులు ఆమె రాకను ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ బలుపేతానికి ఆమె కారణమవుతారని భావించారు. కానీ ఎన్నికల్లో కనీస స్థాయిలో కూడా కాంగ్రెస్ పార్టీ బలం పెరగలేదు. ఎన్నికల తరువాత కూడా ఆమె వైఖరి మారలేదు. సొంత అజెండాతో ముందుకెళ్లడంతో సీనియర్లు నేరుగా అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.షర్మిల నియామకం జగన్ కు ఇబ్బందికరంగా మారింది. కానీ కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.గతంలో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి ఎనలేని ఆదరణ ఉండేది.రాజశేఖర్ రెడ్డి మరణం,రాష్ట్ర విభజన,వైసిపి ఆవిర్భావంతో.. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో పలుచన అయ్యింది. పార్టీ నుంచి గుంప గుత్తిగా నేతలు వైసీపీలో చేరిపోయారు. కాంగ్రెస్ ఓట్ బ్యాంక్ సైతం వైసీపీ వైపు టర్న్ అయ్యింది.అయితే షర్మిలకు బాధ్యతలు అప్పగించిన తర్వాత క్యాడర్ ఇటు వస్తుందని హై కమాండ్ భావించింది.అందుకే ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి నేతల ఆదరణ పెరిగింది.కొత్త ఓటింగ్ శాతం పెరుగుతుందని భావించి చాలామంది టిక్కెట్లు ఆశించారు.ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ ఒక్కరంటే ఒక్కరు కూడా డిపాజిట్ దక్కించుకోలేదు. కడప పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన షర్మిల మూడో స్థానానికి పరిమితం అయ్యారు.అయితే కాంగ్రెస్

అసలు లక్ష్యం నెరవేరింది. ఏపీలో తనను దారుణంగా దెబ్బతీసిన జగన్‌అధికారానికి దూరం కావడం ఆ పార్టీకి ఉపశమనం కలిగించే విషయం.ఈ విషయంలో షర్మిలకు మంచి మార్కులు పడ్డాయి. జగన్ దారుణ పరాజయం వెనుక షర్మిల ఉన్నారన్నది ఒక ప్రధాన విశ్లేషణ. అయితే ఇప్పుడు ఎన్నికలు ముగిసి దాదాపు 6 నెలలు అవుతుంది. వైసీపీ అధికారానికి దూరమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.కానీ ఇంకా షర్మిల వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.ఆమెను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన సీనియర్ నేత రఘువీరారెడ్డి ఏకంగా అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఏపీలో షర్మిల వ్యక్తిగత అజెండా ఒక్కసారి పరిశీలించండి అన్నది ఆ ఫిర్యాదు సారాంశం. అయితే అంతకంటే ముందే టిక్కెట్ల కోసం డబ్బులు వసూలు చేశారని చాలామంది నేతలు ఫిర్యాదు చేశారు. ఇలా వరుస ఫిర్యాదులతో హై కమాండ్ సీరియస్ గా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆమెను మార్చుతారా? లేకుంటే మందలిస్తారా? అన్నది చూడాలి.

# వైసీపీ లీడర్లు బౌన్స్ బ్యాక్ అవుతున్నారా? చంద్రబాబే కారణమా?

విజయవాడ, అక్టోబరు 4,ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయింది. ఈ వంద రోజుల కాలంలో అనేక రాజకీయ పరిణామాలు జరిగాయి. అయితే దాదాపు మూడు నెలల నుంచి వైసీపీ నేతలు పార్టీకి దూరంగా ఉంటున్నారు. మీడియా సమావేశంలో అంబటి రాంబాబు, కాకాణి గోవర్థన్ రెడ్డి వంటి వారు మాత్రమే స్పందిస్తున్నారు తప్పించి మిగిలిన వారు మౌనంగానే ఉంటున్నారు. మరో వైపు అనేక మంది వైసీపీ నేతలు కేసులు ఎదుర్కొంటున్నారు. అందరూ నేతలు ముందస్తు బెయిల్ తెచ్చుకుని కొంత ఊరట పొందారు. కానీ తిరుమల లడ్డూ వివాదం తర్వాత వైసీపీ నేతలు అందరూ యాక్టివ్ అవుతున్నట్లే కనపడుతుంది. లడ్డూ వివాదాన్ని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు అనవసరంగా సాగదీయడంతో వైసీపీకి పెద్దయెత్తున డ్యామేజీ అవుతుందని భావించిన వైసీపీ నేతలు తిరిగి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించడానికి సిద్ధమవుతున్నట్లు కనపడుతుంది. లడ్డూ వివాదాన్ని పెద్దది చేయకపోతే మరికొంత కాలం వైసీపీ నేతలు తమ వ్యాపారాలు, లేక రెస్ట్ మోడ్ లోనే ఉండేవారంటున్నారు. కానీ చంద్రబాబు లడ్డూ వివాదాన్ని లాగుతూ, పీకుతున్నందున తమకు వచ్చే ఎన్నికల్లో హిందూ ఓటు బ్యాంకు దూరమవుతుందని భావించి పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు అడుగులు వేస్తున్నారు. ఇన్నాళ్లు నియోజకవర్గాలకు దూరంగా ఉన్న నేతలు ఒక్కసారి ఫ్రేమ్ లో కనపడటంతో వైసీపీ క్యాడర్ లోనూ ఉత్సాహం కనిపిస్తుంది. వైసీపీ నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నాని వంటి వారు తిరిగి యాక్టివ్ కావడంతో ఇక మిగిలిన లీడర్లు కూడా వరసగా పార్టీలో చురుగ్గా పాల్గొంటారంటున్నారు. ఇది క్యాడర్ లో కొంత ధైర్యాన్ని ఇచ్చే అంశంగానే చెప్పాలి. కొడాలి నాని గుడివాడలో ఓడిపోవడమే అతని వర్గానికి షాకింగ్‌గా చెప్పాలి. ఎందుకంటే ఏ పార్టీ నుంచి అయినా ఏ గుర్తు మీద అయినా గెలిచి సత్తా చాటే కొడాలి నాని ఓటమిని క్యాడర్ కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు మీద వ్యక్తిగత దూషణలు కూడా చేసింది ఆయనే. లోకేష్ ను కూడా అనేక సార్లు అనకూడని మాటలు అని టీడీపీకి ప్రధాన శత్రువుగా మారారు. వల్లభనేని వంశీ కూడా... ఇక వల్లభనేని వంశీ కూడా అంతే. గన్నవరం నియోజకవర్గంలో 2019లో టీడీపీ నుంచి గెలిచి వైసీపీకి మద్దతుదారిగా నిలిచారు. చంద్రబాబు కుటుంబాన్ని కూడా దూషించారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ఇలా ఇద్దరు నేతలు ఒకే సామాజికవర్గానికి చెందిన నేతలు కావడంతో సహజంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారినే టార్గెట్ చేస్తుందని అందరూ భావించారు. ఇప్పుడు వందరోజుల దాటిన తర్వాత లడ్డూ వివాదం మరింత ముదురుతుండటంతో కీలక నేతలు ఎంట్రీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇంకా అనేక మంది వైసీపీ నేతలు రోడ్డు మీదకు వస్తున్నారంటూ వైసీపీ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు కనిపిస్తున్నాయి. మరి చూడాలి.. ఏంజరుగుతుందనేది

# సౌత్ హిందూ ఐకాన్ గా పవన్

తిరుపతి, అక్టోబరు4, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాద తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అయిన విషయాన్ని చంద్రబాబు బయటపెట్టిన తర్వాత పవన్ కల్యాణ్‌లో సనాతన ధర్మ పరిరక్షణ రాజకీయాలు మేలుకున్నారు. డిప్యూటీ సీఎంగా అధికారం చేపట్టిన తర్వాత వంద రోజుల పాటు ఆయన ఎక్కడా పెద్దగా ప్రసంగించలేదు. కనీ వంద రోజుల తర్వాత లడ్డూ ఇష్యూ తర్వాత ఆయనలోని పాత రాజకీయనాయకుడు కనిపించాడు. సెక్యూలరిజం పేరుతో హిందూత్వాన్ని మాత్రమే విమర్శిస్తున్న వారికి.. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు రంగంలోకి దిగుతున్నట్లుగా సంకేతాలు పంపారు. వారాహి డిక్లరేషన్ కూడా ప్రకటించబోతున్నారు. ఇప్పుడు ఇదే అంశంపై తమిళనాడులోనూ ఆయన ఓ ఇంటర్వ్యూ ద్వారా పాపులర్ అయ్యారు. తమిళనాడులో పవన్ కల్యాణ్ అంత సుపరిచితుడు కాదు. ఆయన తెలుగులోనే సూపర్ స్టార్. తమిళవాసులకు పెద్దగా తెలియదు. మర తెలుగులో తమిళ హీరోలు ఎలా తెలుసో పవన్ కూడా అంతే. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అక్కడ రాజకీయాలంటే ఆసక్తి ఉన్న వారికి కూడా బాగా చిరపరిచితం అయ్యాడు. తమిళనాడులో భావజాలాలు, సిద్ధాంతాల మధ్య పోరాటమే రాజకీయంగా ఉంటుంది. అలాంటి సమయంలో పవన్ ప్రారంభిచిన సనాతన ధర్మ రక్షణ హాట్ టాపిక్ అయింది. అందుకే ఓ పాపులర్ టీవీ చానల్ ఆయనను దాదాపుగా గంటన్నర పాటు ఇంటర్వ్యూ చేసింది. ఇందులో పవన్ కల్యాణ్ ప్రధానంగా తమిళ అంశాలు, హిందూత్వంపైనే మాట్లాడారు. తడబడకుండా తమిళ సంస్కృతిపై ఆయన చెప్పిన మాటలు.. అక్కడి ప్రజల్ని ఆకట్టుకున్నాయి. పవన్ కల్యాణ్ చెన్నైలోనే పెరిగారు. సోదరుడు చిరంజీవి హీరోగా మంచి పీక్ స్టేజ్ లో ఉన్నప్పుడు చెన్నైలోనే గడిపారు. అందుకే ఆయనకు తమిళం అనర్గళంగా వచ్చు. తెలుగు ఇండస్ట్రీ హైదరాబాద్ వచ్చేసిన తర్వాత చెన్నైతో అనుబంధం తగ్గిపోయింది కానీ.. భాషను మాత్రం ఆయన మర్చిపోలేదు. తమిళ టెక్నిషియన్లతో ఇప్పటికీ పని చేస్తూంటారు. తమిళంలో ఆయన ఇచ్చిన సమాధానాలు ప్రజల్ని ఫిదా చేశాయి. పవన్ కల్యాణ్ పై అక్కడి ప్రజల్లో ఇప్పటి వరకూ ఉన్న ఇమేజ్ ను పూర్తిగా మార్చేశాయన్న అభిప్రాయాలను తమిళనాడు వాసులు సోషల్ మీడియాలో వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాది హిందూత్వ ఫేస్ గా పవన్ కల్యాణ్ ఎదుగుతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అందకే వారాహి డిక్లరేషన్ ను ఆయన ప్రకటించబోతున్నారు. అందులో ఖచ్చితంగా మరింత ఎక్కువగా సనాతన ధర్మం కోసం తాను చేయబోయే కార్యక్రమాల్ని ప్రకటించే అవకాశం ఉంది. పవన్ రాజకీయం కోసం ఈ సనాతన ధర్మ రక్షణ పోరాటం చేయకపోవచ్చు కానీ.. ఆ పోరాటం చుట్టూ రాజకీయం అయితే ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉంది. తమిళనాడులోనూ ఆయన ఇప్పు?డు వైరల్ గా మారారు. వచ్చే కొద్ది రోజుల్లో ఆయన కర్ణాటక,కేరళల్లోనూ పర్యటించినా ఆశ్చర్యం లేదు. మొత్తంగా పవన్ రాజకీయం మాత్రం వ్యూహాత్మకంగా సాగుతోందని అనుకోవచ్చు.


# తపోవనంలో యనమల పూజలు



తుని,ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కుమ్మరిలోవ తపోవనంలో దేవి శర్నవరాత్రి వేడుకలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి.పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ ఆధ్యర్యంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి విశేషపూజలు జరుగుతున్నారయి. నవరాత్రుల రెండవ రోజున అమ్మవారుశ్రీబాలత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాజరాజేశ్వరిమాతకు టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పాదం పూజ నిర్వహించారు.అనంతరం స్వామివారి ఆశ్శీసులు స్వీకరించారు.

# నాకో పదవి అంటున్న సోము...

రాజమండ్రి, అక్టోబరు 4, సోము వీర్రాజు.. పరిచయం అక్కర్లేని పేరు. ఆయన ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నన్నాళ్లూ జగన్ భజన చేసి తరించారు. జగన్ అడ్డగోలు నిర్ణయాలను, విధానాలనూ రాజును మించిన రాజభక్తి అన్న స్థాయిలో మద్దతు తెలిపి పునీతులయ్యారు. ఒక సమయంలో ఆయన బీజేపీ అధిష్ఠానానికి రాసిన లేఖలో అప్పట్లో రాష్ట్రంలో విపక్ష నేతగా ఉన్న చంద్రబాబు కారణంగా ఏపీలో బీజేపీ పరిస్థితి నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్నట్లుగా తయారైందని పేర్కొన్నారు. ఆయన ఆ లేఖ రాసిన సమయంలో తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అధికారంలో లేదు.. అధికారంలో ఉన్న వైసీపీతో సోము వీర్రాజు అంటకాగుతున్నారు. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా. ఆ హోదాలో ఉన్న ఆయన రాష్ట్ర పార్టీ బలహీనం కావడానికి విపక్ష నేత కారణం అంటూ అధిష్ఠానానికి లేఖ రాయడాన్ని బీజేపీ శ్రేణులే తప్పుపట్టాయి.అదొక్కటే కాదు.. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నంత కాలం ఆయన టార్గెట్ తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నట్లుగా విమర్శలతో చెలరేగిపోయారు. జగన్ కు వంత పాడటం కోసం ఆయన ఒంటెత్తు పోకడలకు పోయారు. అప్పట్లో ఆయన తీరును సొంత పార్టీకి చెందిన రాష్ట్ర నాయకులే జీర్ణించుకోలేకపోయారు. రాష్ట్రంలో అంతంత మాత్రంగానే ఉన్న బీజేపీని కనీసం ఉనికి మాత్రంగా కూడా లేకుండా చేయడమే లక్ష్యమా అన్నట్లుగా అప్పట్లో సోము వీర్రాజు తీరు ఉండేది.సోము వీర్రాజు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీజేపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రం నుంచి ఒక ప్రతినిధి వర్గం హస్తినకు వెళ్లి మరీ సోము వీర్రాజుపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసింది. దానిపై సీరియస్ గా స్పందించిన బీజేపీ హైకమాండ్ వెంటనే పార్టీ రాష్ట్ర వ్యవహారల ఇన్ చార్జ్, అప్పటి కేంద్ర మంత్రి మురళీధరన్ ను రాష్ట్రానికి పంపింది. ఆయన నేరుగా రాజమహేంద్ర వరం వచ్చి పార్టీ నేతలతో బేటీ అయ్యారు. ఈ భేటీలో కూడా సోము వీర్రాజుపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అప్పట్లో ఏపీలో జగన్ ప్రభుత్వ అవినీతిపై చార్జిషీట్ దాఖలు చేయాలని స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశించినా సోము వీర్రాజు నేతృత్వంలోని పార్టీ రాష్ట్ర శాఖ ఆ పని చేయలేదు. ఇదంతా ఎందుకుంటే సోము వీర్రాజు ఎంతగా జగన్ భజనలో తరించారో చెప్పడానికే. అటువంటి సోము వీర్రాజు ఇప్పుడు స్వరం మార్చేశారు. చంద్రబాబు భజనకు రెడీ అయిపోయారు. తిరుమలలో స్వచ్ఛమైన లడ్డు తయారు చేసి భక్తులకు అందించే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చెప్పారు. అందుకు చంద్రబాబు తరఫున తానూ పూచీ అని వాకృచ్చారు. తిరుమల వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధోరణి హేయం అని విమర్శలు గుప్పించారు.జగన్ అధికారంలో ఉండగా మంచి చెడూ మరిచి ఆయనతో అంటకాగిని సోము వీర్రాజును ఇప్పుడు బీజేపీలో పట్టించుకునే నాథుడే లేరు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామే. ఏదో ఒక నామినేటెడ్ పోస్టు, కనీసం ఎమ్మెల్సీ అంటూ సోము వీర్రాజు వెంపర్లాడుతున్నా బీజేపీ హైకమాండ్ పట్టించుకోవడం లేదు. దీంతో మళ్లీ పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవడానికే సోము వీర్రాజు స్వరం మార్చారని బీజేపీ శ్రేణులే అంటున్నాయి. ఇక తెలుగుదేశం వర్గాలైతే సోము వీర్రాజును వీర లెవెల్లో ట్రోల్ చేస్తున్నాయి.



## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కాకినాడ ,కాకినాడ జిల్లా కేంద్రం కాకినాడ నగరంలోని రామారావు పేట లో మందు పార్టీ చేసుకుంటూ పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నారు. ఈ సమాచారం పోలీసులకు తెలిసింది .తొలుత క్రైమ్ సీఐ కృష్ణ బృందం దాడి చేసింది . ఇది టూ టౌన్ పరిధిలో ఉండడంతో టూ టౌన్ సి ఐ చేరుకోవడంతో క్రైమ్ సీఐ బృందం వెళ్లిపోయింది.పేక ఆడుతున్నవారు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడినప్పటికీ రాజకీయ ఒత్తిడి మేరకు ఎలాంటి కేసులు పెట్టకుండా పోలీసులు వదిలేసినట్లు సమాచారం. భారీ ఎత్తున నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా పేకాట రాయుళ్ల నుంచి పెద్ద ఎత్తున నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## పిడుగుపాటుకు ముగ్గురు మృతి

కడప పిడుగుపడి ముగ్గురు మృతి చెందారు. పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు గ్రామ పొలాలలో ఘటన జరిగింది. పిడుగుపాటుకు మహిళతో పాటు అబ్బాయి ఒక యువకుడు మృతి చెందారు. మృతులు శివపార్వతి (30) తేజేశ్వర్ రెడ్డి (10) మారుతి ప్రసాద్ రెడ్డి (30) గా గుర్తించారు. మృతులు వ్యవసాయ పనులు చేసుకుంటుండగా వర్షం పడుతుంటే చెట్టు కిందకు వెళ్లడంతో పిడుగుపాటుకు గురయ్యారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్వర్ణాంధ్రఏ2047 జిల్లా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04-స్వర్ణాంధ్ర ఏ2047 ప్రణాళికలో భాగంగా రాబోయే 23 సంవత్సరాలలో నంద్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా ప్రణాళిక రచన సిద్ధం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో స్వర్ణాంధ్ర ఏ2047 జిల్లా దార్శనిక పత్ర ప్రణాళికపై అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల స్టేక్ హోల్డర్స్ లతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ పద్మజ, సిపిఓ వేణుగోపాల్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో స్వర్ణాంధ్రఏ2047 ప్రణాళిక నిమిత్తం జిల్లాస్థాయి ప్రణాళిక రూపొందిస్తున్న నేపథ్యంలో ప్రజలు, అన్ని సెక్టార్ల స్టేట్ హోల్డర్స్ భాగస్వాములై తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించి మండల స్థాయి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 60 వేల మందికి పైగా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తమ యొక్క అభిప్రాయాలు పొందుపరిచాన్నారు. ఈ సమీక్షలో దాదాపు 35 మంది వ్యక్తులు తమ విలువైన సూచనలు, సలహాలు వెల్లుబుచ్చారని అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని రాబోయే 23 సంవత్సరాలలో నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించుకోవడానికి సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు, అన్ని సెక్టార్ల స్టేక్ హోల్డర్స్ సమిష్టిగా నంద్యాలను స్వర్ణ జిల్లాగా మార్చేందుకు సహకరించాలని ఆమె ఆకాంక్షించారు. అంతకుముందు రావినూతల దుర్గాప్రసాద్, డాక్టర్ వసుధ, దస్తగిరి, డా. యశోదర, ఇస్మాయిల్, రాజామహేంద్రనాథ్, నాగరాజు, డాక్టర్ రాజశేఖర్, నోబియా భాను, మహమ్మద్, ఉమామహేశ్వరి, జై పద్మావతి, రాంబాబు, ముత్యాల నాయుడు, రాజశేఖర్ నాయుడు ప్రమీల తదితరులు పాల్గొని తమ అమూల్యమైన సలహాలను జిల్లా స్థాయి కమిటీకి సూచించారు

## శ్రీ లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన కాళికామాత అమ్మవారు



విభారె న్యూస్ ఆళ్లగడ్డ మా ప్రతినిధి అక్టోబర్ 04 :- ఆళ్లగడ్డ విశ్వరూప నగర్ లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ కాళికామాత ఆలయం లో దసరా శరన్నవరాత్రులు ఆలయ కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్రాచారి, మహిళా కమిటీ అధ్యక్షురాలు అనురాధ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. అందరూ భాగంగా రెండవ రోజు శుక్రవారం శ్రీ కాళికామాత అమ్మవారు శ్రీ లక్ష్మి దేవి అలంకారం లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు చంద్రశేఖరా చారి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిం చారు. ఈ పూజా కార్యక్రమానికి ఏకాబత్తుని బ్రహ్మయ్య ఆచారి ధర్మపత్ని జ్యోతి, వడ్ల వీరయ్య ఆచారి ధర్మపత్ని నాగేశ్వరి ఉభయ దారులుగా వ్యవహరించారు. లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం దర్శనానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళాక యువజనసంఘంసభ్యులు పాల్గొన్నారు.

## డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గా వి. హరినాథ్ బాబు పదవి బాధ్యతలు స్వీకరణ



విభారె న్యూస్ అక్టోబర్ 04 కర్నూలు జిల్లా ప్రతినిధి...శుక్రవారం రోజు కర్నూలు డిప్యూటి చీఫ్ మెకానికల్ ఇంజినీర్ గా వి.హరినాథ్ బాబు పదవీ బాధ్యతలు స్వీకరించారు. వి.హరినాథ్ బాబు కడప కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ గా పనిచేస్తూ,బదిలీ పై కర్నూలుకు వచ్చారు.

## గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన సుంకులమ్మ దేవి

విభారె న్యూస్ అక్టోబర్ 03 ఎమ్మిగనూరు..దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా రెండవ రోజు అయిన శుక్రవారం రోజు గాయత్రి దేవి అలంకరణలో సుంకులమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చన, ఆకు పూజ, నిమ్మకాయల మాల, గజమాల తదితర అలంకరణలతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి కి ఒడి బియ్యం సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు. గాయత్రీ దేవి అలంకరణలో కార్తీక, ఉష, సుగుణ వారిచే అలంకరణ గావించబడినది. భక్తులు ఉదయం నుండే విరివిగా పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. పూజ అనంతరం మహా మంగళహారతిని ఆలయ పూజారి నాగరాజు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు.



## దసరా పండుగను పురస్కరించుకొని ప్రయాణికులకు ప్రత్యేక బస్సులను నడపబడును



విభారె న్యూస్ అక్టోబర్ 04 కర్నూలు జిల్లా ప్రతినిధి..దసరా పండుగను పురస్కరించుకొని తమ, తమ స్వంత ఊళ్లకు వెళ్ళగోరు ప్రయాణీకుల సౌకర్యార్థం హైదరాబాదు, బెంగుళూరు,తిరుపతి, చెన్నై, విజయవాడ నగరాల నుండి కర్నూలుకు వచ్చు ప్రయాణీకుల కొరకు తేది: 08.10.2024 నుండి 11.10.2024 వరకు 81 బస్సులను, అలాగే తిరుగు ప్రయాణమై వెళ్ళు ప్రయాణీకుల సౌకర్యార్థం కర్నూలు నుండి హైదరాబాదు, బెంగుళూరు, తిరుపతి, చెన్నై, విజయవాడ నగరాలకు తేది: 13.10.2024 నుండి 16.10.2024 వరకు 83 బస్సులను, మొత్తం మీద 164 ప్రత్యేక బస్సులను, షెడ్యూలు బస్సులకు అదనంగా నడుపబడును. ఈ సర్వీసులకు రాను, పోను రిజర్వేషన్ సౌకర్యం కలదు. ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న వారికి, రాను,పోను చార్జిలో 10% శాతం రాయితీ కూడా కలదు. ప్రజలు ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం, కర్నూలు జిల్లా వారు కల్పిస్తున్నఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవలసిందిగా కోరడమైనది. ఈ ప్రత్యేక బస్సులలో కూడా సాధారణ చార్జి మాత్రమే వసూలు చేయబడును..

## పురుగుల నివారణ కు అవగాహన సదస్సు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04-జిల్లా వనరుల కేంద్రము ఆధ్వర్యం లో శుక్రవారం నాడు సబ్ డివిజన్ పరిధిలో వ్యవసాయ శాఖ ఒక్కరోజు నైపుణ్యాబి వృద్ధి శిక్షణా కార్యక్రమము నిర్వహించారు. .కార్యక్రమం లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాదికారి బాలాజీ నాయక్. వెంకట రమణమ్మ హాజరయ్యారు. బాలాజీ నా య క్ వరి, మినుము పంటల లో పంటలను ఆశించు పురు ులు వాటి నివారణ చర్యలు తెలియజేసారు. వెంకట రమణమ్మ వివిధ పంటలలో వ్యాపించే తెగుళ్లు మరియు వాటి నివారణ చర్యలు తెలియజేశారు, ఎడిఎ , డి.రాజశేఖర్ వ్యవసాయ శాఖ లో అమలవుతున్న వివిధ రకాల పథకాల గురించి తెలియజేస్తూ, ఇంకా ఇ-కేవైసి చేయని రైతులకు 7 వ తేదీ లోపు పూర్తి చేయాలని తెలిపారు . అలాగే జిల్లా వనరుల కేంద్రం, సహాయ వ్యవసాయ సంచాలకులు సరాలమ్మ మట్టి పరీక్షలు తీసే విధానము మరియు భూసార ఆధారిత ఎరువుల వాడకం వలన కలిగే ఉపయోగాలు తెలియజేసారు. ఈ కార్యక్రమములో మండల వ్యవసాయ అధికారి, బనగానపల్లె సుబ్బారెడ్డి , మండల వ్యవసాయ అధికారి, నంద్యాల, ప్రసాద రావు మరియు నంద్యాల సబ్ డివిజన్ స్థాయిలో పనిచేస్తున్న వీఏఏలు లు, విహెచ్ ఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

## పిఆర్సి కమిషన్ ను ఏర్పాటు చేసి తక్షణమే ఐ.ఆర్. ను చెల్లించాలి..

### ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డిమాండ్

విభారె న్యూస్ అక్టోబర్ 04 ఎమ్మిగనూరు. ఏపీటీఎఫ్ ఎమ్మిగనూరు జోన్ అధ్యయన తరగతులు స్థానిక వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాల యందు రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా హాజరైన రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, భానుమూర్తులు హాజరై తక్షణమే ఐ.ఆర్.ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అధ్యయన తరగతుల్లో భాగంగా ప్రస్తుతం విద్యారంగం ఎదుర్కొంటున్న సంక్షోభాలు,వాటిపై ఏపీటీఎఫ్ సంఘవైఖరి మొదలైన విషయాలపై కార్యకర్తలకు అవగాహన పరచడం జరిగింది. జిపిఎస్ పేరుతో సిపిఎస్ నే మసిపూసి మారేడు కాయ చేసి తిరిగి ప్రవేశపెట్టడాన్ని ఏపీటీఎఫ్ వ్యతిరేకిస్తుందని, తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను ప్రమోషన్లతో నింపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. విద్యారంగం వినాశన దిశకు చేరువ కావడానికి దోహదపడుతున్న జీవో నెంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలని, అశాస్త్రీయమైన సిలబస్ భారాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే భానుమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా ప్రమాణాల పెంపుదలకు బోధనేతర కార్యక్రమాలు తగ్గించాలని కోరుతుంటే, యాప్ ల పేరుతో రకరకాల పథకాల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడాన్ని ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ విధానాలే ఈనాటికి కొనసాగుతున్నాయనీ, అక్రమ బదిలీలకు ప్రభుత్వం పూనుకున్నాయనే వార్తలు రావడం గర్హనీయమని రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ ప్రసాద్ రావు పేర్కొన్నారు. తక్షణమే ఉద్యోగులకు బకాయి పడ్డ మొత్తాలను చెల్లించాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని తెలియజేశారు. ఈ తరగతిలో ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర, ఏపీటీఎఫ్ నిబంధనావళి, వివిధ అంశాలపై ఏపీటీఎఫ్ వైఖరిని కార్యకర్తలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కోణంకి అశోక్ కుమార్ ప్రాస కార్యదర్శి పాతిరెడ్డి ఉపాధ్యాయ సంపాదకులు నరేష్ కుమార్ కర్నూలు జిల్లా పూర్వ అధ్యక్షులు ఏపీ వీరన్న రామన్న ప్రతాప్సిన్హ శ్రీనివాసులు సోమేశ్వరి నరసమ్మ సునీత వాణి, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.




## పట్టణంలోకి పల్లెకుక్కలు

### హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 04- పట్టణంలోకి పల్లె కుక్కల వస్తున్నాయని పట్టణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో నంద్యాల చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి కుక్కలను ట్రాలీ ఆటోలలో తీసుకొచ్చి వదులు తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తొందరలో కుక్కల కట్టడి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని ఆయన అన్నారు. పట్టణంలో కి కుక్కల ను తీసుకొస్తున్న ట్రాలి ఆటోల పై విచారణ జరిపి వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు . కుక్కల పై పట్టణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు .

## దేవి శరన్నవరాత్రులలో భాగంగా రెండవ రోజు నగరేశ్వర స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు..




విభారె న్యూస్ అక్టోబర్ 04 ఎమ్మిగనూరు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయంలో రెండవ రోజు శుక్రవారం శ్రీ నగరేశ్వర స్వామి, అమ్మవార్లకు ఉదయమే పంచామృతాభిషేకం, ఆకు పూజ, వివిధ రకాల విశేష పూజలను నిర్వహించారు. ఉదయం 10.30 నిలకు ఆర్యవైశ్య మహిళలచే లలితా సహస్రనామావళి,11.00 గంటలకు అమ్మవారికి కుంకుమతో ప్రత్యేక అష్టోత్తర శతనామావళిని గావించారు. పై పూజ కార్యక్రమాలు అన్నియు ఆలయ ప్రధాన అర్చకులు రాతన గురు ప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.. పూజ అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు.. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190